

కళాశాలలకు కొత్తరూపు

నాడు–నేడు కింద జిల్లాలో 23 కళాశాలలను అభివృద్ధి చేయనున్నారు. అందుకోసం రూ.14.56 కోట్లతో ప్రతిపాదనలు పంపారు.

- 8లో..



కారు ఢీకొని వృద్ధుడు మృతి

ముందు వెళ్తున్న మోటారుసైకిలిను వెనుక నుంచి కారు ఢీకొనడంతో ఒక వృద్ధుడు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి.

- 8లో..

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 30 /20

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. రాత్రి వేళ చలి తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పలు రైళ్లు రద్దు

కురిచేడు: గుంటూరు నుంచి ద్రోణాచలం మీదుగా నడిచే పలు రైళ్లను ఆదివారం నుంచి రద్దు చేసినట్లు రైల్వే శాఖ అధికారులు తెలిపారు. డంబ్లింగ్ పనులు జరుగుతున్నందున రైళ్ల రద్దు తప్పనిసరైందని అధికారులు తెలిపారు. 17228 గుంటూరు –డోన్ బండి ఈనెల 28వ తేదీ వరకు, 17227 డోన్ –గుంటూరు రైలు బండి మార్చి 1 వరకు ,07889 రేపల్లె –మార్కాపురం రైలు ఈనెల 28 వరకు ,07890 మార్కాపురం–రేపల్లె ఈనెల 28 వరకు ,07067 మచిలిపట్నం–కర్నూలు సిటీ వారానికి మూడు రోజులు నడిచే రైలు బండి ఈనెల 14, 16, 18, 21, 23, 25, 28 తేదీల్లో, 07068 కర్నూలు సిటీ –మచిలిపట్నం రైలు బండి 15, 17, 19, 22, 24, 26లో, మార్చి1న, 17251 గుంటూరు –కాచిగూడ రైలు బండి ఈ నెల 28 వరకు,1 7252 కాచిగూడ–గుంటూరు ఈనెల 13 నుంచి మార్చి 1వ తేదీ వరకు, 17577 కాచిగూడ–మెదక్ ఈనెల 13 నుంచి మార్చి 1 వరకు , 17578 మెదక్–కాచిగూడ ఈనెల 13 నుంచి మార్చి 1 వరకు రద్దు చేశారు. 17253 గుంటూరు –సికింద్రాబాదు రైలు ఈనెల 19 నుంచి 28 వరకు గుంటూరు నుంచి దొనకొండవరకు, 17254 సికింద్రాబాదు–గుంటూరు రైలు ఈనెల 18 నుంచి 27వ తేదీ వరకు దొనకొండ నుంచి గుంటూరు వరకు, 17261 గుంటూరు –తిరుపతి రైలు ఈనెల 19 నుంచి 28 వరకు, గుంటూరు నుంచి మార్కాపురం వరకు, 17262 తిరుపతి–గుంటూరు రైలు ఈనెల 18 నుంచి 27వ తేదీ వరకు మార్కాపురం నుంచి గుంటూరు వరకు పాక్షికంగా రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

మార్కాపురం: మండల కేంద్రం మార్కాపురం మీదుగా వెళ్ళే పలు రైళ్ళను డబ్లింగ్ పనుల కారణంగా గుంటూరు రైల్వే అధికారులు రద్దు చేశారని డీఆర్‌యూసీసీ మెంబర్ ఆర్‌కేజీ నరసింహం తెలిపారు. ఈ నెల 12 నుంచి 28 వరకు గుంటూరు – కాచిగూడ, కాచిగూడ – గుంటూరు, ఈ నెల 19 నుంచి 28 వరకు గుంటూరు – తిరుపతి రైళ్ళను రద్దు చేసినట్లు తెలిపారు.

కరాటేతో ఆత్మవిశ్వాసం రెట్టింపు



పోటీలో తలపడుతున్న విద్యార్థినులు

ఒంగోలు: కరాటేతో ఆత్మవిశ్వాసం రెట్టింపు అవుతుందని, ప్రతి చిన్నారి కరాటే నేర్చుకునేందుకు ఇన్‌స్ట్రక్టర్లు, కోచ్‌లు అందిస్తున్న ప్రోత్సాహం ప్రశంసనీయం అని ఏపీ, తెలంగాణా జపాన్ కరాటే అసోసియేషన్ చీఫ్ న్యాయ నిర్ణేత రాపోలు సుదర్శన్ అన్నారు. ఒంగోలులోని పేస్ ఎస్ఆర్ స్కూల్లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయిలో నిర్వహించిన రెండవ జపాన్ కరాటే అసోసియేషన్ పోటీలకు 500 మందికి పైగా విద్యార్థులు కటా, కుమితే విభాగాల్లో పాల్గొన్నారు. అండర్ 8,10,12,14,18 తోపాటు పురుషులు, స్త్రీ విభాగాల్లో పోటీలు జరిగాయి. టోర్నమెంట్ అధ్యక్షుడు పడమటి నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌కు తమ పాఠశాల వేదిక కావడం ఆనందంగా ఉందన్నారు. ఈ టోర్నమెంట్‌కు జపాన్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొడాలి రవిబాబు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు. అనంతరం జరిగిన పోటీల్లో చిన్నారులు అద్భుత ప్రతిభ ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. విజేతలకు మెడల్స్‌ను అతిథులు అందించారు.

సత్తా చాటిన సిద్ధార్థ కరాటే అకాడమీ విద్యార్థులు:


జపాన్ కరాటే అసోసియేషన్ నిర్వహించిన కరాటే పోటీల్లో తమ అకాడమీ విద్యార్థులు సత్తాచాటారని సిద్ధార్థ కరాటే అకాడమీ నిర్వాహకులు తెలిపారు. కటా, కుమితే విభాగాల్లో ఐదుగురు విద్యార్థులు 9 పతకాలను కైవసం చేసుకున్నారు. కటా విభాగంలో కిషన్ మొదటి స్థానం, ఎం.సాయినిఖిల్ కటా విభాగంలో మొదటి స్థానం, కుమితే విభాగంలో ద్వితీయ స్థానం సాధించాడు. టి.వరుణ్‌తేజ్ కటా విభాగంలో మూడవ స్థానం, కుమితే విభాగంలో మూడవ స్థానం సాధించాడు, కటా విభాగంలో ఎస్.సంజిత్ రెండవ స్థానాన్ని, కుమితే విభాగంలో రెండవ స్థానం కైవసం చేసుకున్నాడు. ఎస్.దర్శన్ కటా విభాగంలో మూడవ స్థానం, కుమితే విభాగంలో రెండవ స్థానం సాధించడంతో ఏపీ స్టేట్ కరాటే అసోసియేషన్ చైర్మన్ శ్రీప్రతిభ వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు ఎం.మురళీకృష్ణ, ఎస్‌కెఏపీ జిల్లా అధ్యక్షుడు జి.రాఘవ, కోచ్ విజయలక్ష్మి , వెంకటేశ్వర్లు, ఏపీ, తెలంగాణా రాష్ట్రాల కరాటే కోచ్ నల్లూరి మోహన్‌రావు అభినందించారు.

ఆకట్టుకున్న ట్రూఫైటర్స్ మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులు:

జపాన్ కరాటే అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో తమ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారని ఒంగోలు ట్రూఫైటర్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ చీఫ్ ఇన్‌ఛార్జి షేక్ హిమాంషా తెలిపారు. కటా విభాగంలో వి.ఆర్యన్ (రజిత), బి.భరత్‌వాజ్ (కాంస్య), ఎస్ఎంఎస్ ఆర్యన్ (రజత), షేక్ ముజామిల్ (కాంస్య), ఎస్.తిరుమల రెడ్డి (కాంస్య), వి.ధనుష్ (కాంస్య), ఎన్.రాజేష్ నందన్ (కాంస్య) పతకం సాధించారు. కుమితే విభాగంలో ఎస్.తిరుమలరెడ్డి, ఎన్.రాజేష్‌నందన్, బి.భరత్‌వాజ్ (రజత పతకం)లను కైవసం చేసుకున్నారని తెలిపారు.

ఇంటింటికీ జీవ జలం

నానాటికీ పెరుగుతున్న ఒంగోలు నగర జనాభాను దృష్టిలో ఉంచుకుని మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చర్యలు తీసుకుంటున్నారు. జల్‌జీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయిల ద్వారా నీళ్లిచ్చేలా నిధులు మంజూరు చేయించారు. వందల కోట్ల నిధులతో జీవజలాన్ని ఇంటింటికీ చేరుస్తున్నారు. నియోజకవర్గంలో 26,251 మంచినీటి కుళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. కొత్తపట్నం మండలంలో 2,240 కుళాయిలు, ఒంగోలు మండలంలో 5,308 కుళాయిల కనెక్షన్లు ఇప్పటికే ఇచ్చేశారు. మిగిలినవి వేగంగా జరుగుతున్నాయి.



ఒంగోలు నగరం వ్యూ

- ఒంగోలు నియోజకవర్గంలో శాశ్వత మంచినీటి సమస్య పరిష్కారమే లక్ష్యంగా చర్యలు
- ఒంగోలు, కొత్తపట్నం మండలాల్లో 26,251 ఇళ్లకు మంచినీటి కుళాయిలు
- జల్ జీవన్ మిషన్ ద్వారా మొత్తం 72 పనులు మంజూరు
- ఎమ్మెల్యే బాలినేని నిధులతో పాటు జిల్లా పరిషత్ నిధుల వినియోగం
- నగరానికి రూ.339 కోట్లు మంజూరు చేసిన సీఎం వైఎస్ జగన్
- అమృత్ ఫేజ్–1 కోసం రూ.70 కోట్ల గ్రాంట్

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: జిల్లా వ్యాప్తంగా జల్ జీవన్ స్రవంతి ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి ఇవ్వాలన్న ధ్యేయంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. తాగటానికి, వాడుకునే నీటికి ఇబ్బంది పడకుండా.. ఏ ఒక్కరి సమయం వృథా కాకుండా చేయాలన్న సదుద్దేశంతో మంచినీటి పథకాలు ఏర్పాటు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల చేసిన సర్వే ప్రకారం ఒంగోలు నగర ప్రజలు దాదాపు 3 లక్షలు దాటారు. అభివృద్ధి చెందుతూ, వేగంగా విస్తరిస్తున్న నగరంలో శివారు ప్రాంతాల ప్రజలకు సైతం మంచినీటి ఇబ్బందులు లేకుండా చేయడంతో పాటు, నియోజకవర్గంలోని ఒంగోలు, కొత్తపట్నం మండలాల్లో శాశ్వతంగా మంచినీటి సమస్య లేకుండా చేసేందుకు వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అడుగులు వేగంగా ముందుకేస్తున్నారు.




గాదెపాలెంలో నిల్వ ఉన్న పైపులను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఒంగోలు డీఈ తమ్మిశెట్టి చంద్రశేఖర్

ఒంగోలు నగరంతో పాటు ఒంగోలు, కొత్తపట్నం మండలాల్లో కూడా ప్రతి ఇంటికీ అమృత జలం అందించేందుకు ప్రతి గ్రామంలో మంచినీటి పథకాలను మంజూరు చేయించారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లోపు మంజూరైన అన్ని మంచినీటి పథకాలను పూర్తి చేయాలన్న లక్ష్యంగా అటు కాంట్రాక్టర్లను, ఇటు అధికారులను ఉరుకులు, పరుగులు పెట్టిస్తున్నారు.

రెండు మండలాల్లో 72 వర్కులు

ఒంగోలు, కొత్తపట్నం మండలాల్లో ప్రతి ఇంటికీ మంచినీటి సౌకర్యం, ఇంటింటికీ మంచినీటి కుళాయి బిగించేలా ప్రణాళికలు రూపొందించారు. రెండు మండలాల్లో కలిపి అన్ని గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ పథకంలో 72 పనులు మంజూరు చేశారు. ఈ పనులన్నింటికీ కలిపి రూ.26 కోట్లు ఇచ్చారు. అందుకుగాను రెండు మండలాల్లో నూతనంగా 26,251 మంచినీటి కుళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. కొత్తపట్నం మండలంలో 19,262 మంచినీటి కుళాయిలకు ఇచ్చేందుకు లక్ష్యంగా నిర్ణయించారు. వాటిలో ఇప్పటికే 2,240 కుళాయిలు బిగించారు. అదేవిధంగా ఒంగోలు మండలంలో నూతనంగా 6,989 కుళాయిలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటికే 5,308 కుళాయిలు గృహాలకు ఇచ్చేశారు. మిగతా పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయి. జల్ జీవన్ మిషన్ పథకంతో పాటు ఎమ్మెల్యే గ్రాంటు కింది రెండు మండలాలకు బాలినేని రూ.కోటికి పైగా కేటాయించారు. ఇక జిల్లా పరిషత్ నిధుల కింద రూ.1.05 కోట్లు వెచ్చించి గ్రామాల్లోని మంచినీటి పథకాల మరమ్మతులకు వెచ్చించారు.

మంచినీటి సమస్య లేకుండా చేస్తా..



ఒంగోలు నగరంతో పాటు నియోజకవర్గంలోని ఒంగోలు, కొత్తపట్నం మండలాల్లో మంచినీటి సమస్య లేకుండా చేయటానికి పూనుకున్నాం. రూరల్ మండలాలైన ఒంగోలు, కొత్తపట్నం మండలాల్లో ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికీ నూతనంగా మంచినీటి కుళాయిలు జల్ జీవన్ మిషన్ ద్వారా అందిస్తాం. అదేవిధంగా పెరుగుతూ పోతున్న ఒంగోలు నగరంలో కూడా అదే స్థాయిలో మంచినీటిని అందించేందుకు ప్రణాళికలు రూపొందించాం. ప్రతి మనిషికీ 40 లీటర్ల చొప్పున అందించేలా చర్యలు చేపడుతున్నాం. అందుకోసం ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను పరుగులు పెట్టిస్తున్నాం.

– బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే



కొత్తపట్నం మండలంలోని గాదెపాలెంలో మంచినీటి పైప్‌లైన్ వేయటానికి తవ్విన కాలువ

ఒంగోలు నగరంలో శాశ్వత పరిష్కారం దిశగా...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఒంగోలు వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే బాలినేని నగర ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్య విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వేదిక మీదనే మంచినీటి సమస్య తీర్చేందుకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చి ప్రత్యేక జీఓ ద్వారా రూ.339 కోట్లు మంజూరు చేశారు. ప్రస్తుతం డీపీఆర్ తయారు చేసి టెండర్ ప్రక్రియ దశలో ఆ పథకం పనులు ఉన్నాయి. అదేవిధంగా టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పుణ్యమా అని అమృత్ పథకం ఫేజ్–1 పనులు మధ్యలోనే ఆపేసి నగర ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారు. దీంతో ఆ పథకం ముందుకు సాగటానికి సీఎం వైఎస్ జగన్‌తో ప్రత్యేకంగా మాట్లాడి రూ.70 కోట్లు గ్రాంటుగా తీసుకొచ్చారు బాలినేని. దీంతో మధ్యలో ఆగిపోయిన అమృత్ పథకం పనులు వేగంగా సాగుతున్నాయి.

గ్రామాల్లో ప్రతి ఇంటికీ ఉచితంగా కుళాయి



గ్రామాల్లో ప్రతి ఇంటికీ ఉచితంగా మంచినీటి కుళాయి ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అందుకోసం ఒంగోలు, కొత్తపట్నం మండలాల్లో జల్ జీవన్ స్రవంతి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రెండు మండలాల్లో కలిపి 72 పనులు మంజూరైతే కొన్ని పనులు పూర్తయ్యాయి. మరికొన్ని పనులు జరుగుతున్నాయి. ఇంకొన్ని పనులు టెండర్ల దశలో ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి కోసం ఏ ఒక్కరి సమయం వృథా కాకూడదు అన్నదే ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రతి నెలా జరుగుతున్న పనులపై బాలినేని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

– టి.చంద్రశేఖర్, ఒంగోలు డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్

మంచినీటి వ్యవస్థలో సమూల మార్పులు



ఏడాదికేడాదికి పెరుగుతున్న ఒంగోలు నగర ప్రజల మంచినీటి అవసరాలు తీర్చటమే లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగుతున్నాం. అందుకు తగ్గట్టుగా ప్రభుత్వం నుంచి అమృత్ ఫేజ్–1 కోసం రూ.70 కోట్ల గ్రాంటును బాలినేని తెప్పించారు. అదేవిధంగా ఒంగోలు నగరానికి సంబంధించి మంచినీటి వ్యవస్థను సమూలంగా మార్పులు చేసేందుకు, శాశ్వత మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రూ.339 కోట్లు బాలినేని మంజూరు చేయించారు.

– ఎం.వెంకటేశ్వరరావు, కమిషనర్, ఒంగోలు నగర పాలక సంస్థ

ఎస్పీ స్పందన తాత్కాలిక రద్దు

ఒంగోలు టౌన్: ఉపాధ్యాయ, పట్టభద్రుల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో కోడ్ అమలులో ఉన్న కారణంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు అడిషన్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దూరప్రాంతాల నుంచి ఒంగోలు వచ్చే ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

ఆల్ ఇండియా మాస్టర్స్ గేమ్స్‌లో జగదీష్ ప్రసాద్ ప్రతిభ

ఒంగోలు సబర్బన్: ఒంగోలుకు చెందిన డి.జగదీష్ ప్రసాద్ హైదరాబాద్‌లో ఈ నెలలో నిర్వహించిన 5వ ఆల్ ఇండియా మాస్టర్స్ గేమ్స్‌లో పలు మెడల్స్ సాధించి తన ప్రతిభ కనబరిచాడు. ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన గేమ్స్, స్పోర్ట్స్ ఈవెంట్లలో పలు పతకాలు సాధించాడు. ఈ మేరకు లాల్ బహదూర్ స్టేడియంలో మాస్టర్ గేమ్స్ తెలంగాణ జనరల్ సెక్రటరీ వై.రామారావు చేతుల మీదుగా మెడల్స్ తీసుకున్నాడు. జగదీష్ ప్రసాద్ 40 సంవత్సరాల ప్లస్ విభాగంలో ఫుట్‌బాల్ విన్నర్స్ టీంలో గోల్డ్‌మెడల్ అందుకున్నాడు. హై జంప్‌లో రజత పతకం సాధించాడు. హ్యామర్ త్రోలో రజతం, మూడు వందల మీటర్ల నడకలో కాంస్య పతకాన్ని దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా ఈ ఏడాది మే నెల 12 నుంచి 20వ తేదీ వరకు సౌత్ కొరియాలోని జియో కబక్ సిటీలో అంతర్జాతీయంగా నిర్వహిస్తున్న ఆసియా–పసిఫిక్ మాస్టర్స్ గేమ్స్‌కు అర్హత సాధించాడు. అందుకోసం పలువురు జగదీష్ ప్రసాద్‌ను అభినందించారు.



హైదరాబాద్‌లో ఆల్ ఇండియా మాస్టర్స్ గేమ్స్ ప్రధాన కార్యదర్శి వై.రామారావు చేతుల మీదుగా మెడల్ తీసుకుంటున్న డి.జగదీష్ ప్రసాద్

నెలాఖరు వరకు రామతీర్థం జలాలు

- రామతీర్థం రిజర్వాయర్ పూర్తి నీటి మట్టం 85.34 మీటర్లు కాగా ప్రస్తుతం నీరుంది 79.83 మీటర్లు
- రిజర్వాయర్‌కు దిగువనున్న మేజర్‌లకు సాగర్ జలాలు విడుదల
- వరి, మిర్చి, పొగాకు, మొక్కజొన్న, నువ్వు పంటలకు నీరు
- ఒంగోలు ఎస్ఎస్–1, 2 ట్యాంక్‌లకు త్వరలో నీటి విడుదల



రామతీర్థం రిజర్వాయర్

చీమకుర్తి: రామతీర్థం రిజర్వాయర్ ద్వారా జిల్లాలోని దిగువనున్న ప్రాంత వాసులకు సాగర్ జలాలు ఈనెలాఖరు వరకు మాత్రమే రానున్నాయి. ఇరిగేషన్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరు నెలలుగా సాగర్ డ్యాం నుంచి వస్తున్న సాగర్ జలాలు రామతీర్థం రిజర్వాయర్ ద్వారా దిగువనున్న ప్రాంతాల్లోని రైతులు సాగు చేసుకుంటున్న వరి, ఇతర పంటలకు అందించారు. దానితో పాటు ఒంగోలు ఎస్ఎస్–1, 2 ట్యాంక్‌లకు ఒంగోలు పట్టణ ప్రాంత ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఇప్పటికి రెండు సార్లు నింపారు. సాగర్ జలాలు త్వరలో నిలిచిపోనున్న నేపథ్యంలో మరో మూడు వారాలు మాత్రమే సాగర్ జలాలు ఇవ్వనున్నట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ లోపు వరి కోతలకు వస్తున్నందున వరి, మిర్చి, మొక్కజొన్న, పొగాకు, నువ్వుల వంటి పంటలు సాగు చేసుకునే రైతులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు తెలిపారు. దానిలో భాగంగా రామతీర్థం రిజర్వాయర్ పూర్తి నీటిమట్టం 85.34 మీటర్లు కాగా ప్రస్తుతం 79.8 మీటర్లు వరకు సాగర్ జలాలు ఉన్నాయి. ఓటీసీ నుంచి రిజర్వాయర్‌లోకి ప్రస్తుతం 314 క్యూసెక్కుల నీళ్లు వస్తున్నాయి. రిజర్వాయర్ నుంచి దిగువనున్న మేజర్‌లకు 214 క్యూసెక్కుల వంతున వదులుతున్నట్లు ఇరిగేషన్ శాఖ వద్దనున్న గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. వరి, ఇతర పంటలను సాగు చేసే రైతులకు ఇచ్చేందుకు ఈతముక్కల మేజర్‌కు 40 క్యూసెక్కులు, త్రోవగుంట మేజర్‌కు 60 క్యూసెక్కులు, చిలకపాడు మేజర్‌కు 20 క్యూసెక్కులు, కారుమంచి మేజర్‌కు 35 క్యూసెక్కుల చొప్పున వదులుతున్నారు.

త్వరలో ఒంగోలు ఎస్ఎస్–1, 2 ట్యాంక్‌లకు నీరు విడుదల

ఒంగోలు పట్టణ ప్రాంత వాసుల దాహార్తిని తీర్చేందుకు రామతీర్థం రిజర్వాయర్ నుంచి త్వరలో సాగర్ నీటిని వదలనున్నారు. ఎస్ఎస్ ట్యాంక్–1లో ప్రస్తుతం 1190 మిలియన్ లీటర్లు, ఎస్ఎస్ ట్యాంక్–2లో 2372 మిలియన్ లీటర్ల వరకు నీటి మట్టం ఉంది. అవి రానున్న నెల రోజులకు మాత్రమే సరిపోనున్నాయి. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఒంగోలులోని ఎస్ఎస్–1, 2 ట్యాంక్‌లను మరో విడత రామతీర్థం జలాలతో నింపేందుకు ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం రామతీర్థం రిజర్వాయర్‌లో లీకేజీ కారణంగా మొదటి గేటును చేపల సొసైటీ ద్వారా వచ్చిన రూ.3 లక్షలతో మరమ్మతులు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. రెండు, మూడు రోజుల్లో గేటు మరమ్మతులు పూర్తి చేయగానే రిజర్వాయర్ నుంచి సాగర్ జలాలను విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

ఫిబ్రవరి నెలాఖరు వరకు సాగర్ జలాలు ఇస్తాం

రామతీర్థం రిజర్వాయర్ నుంచి దిగువనున్న ప్రాంత వాసులకు సాగర్ జలాలను ఈనెలాఖరు వరకు ఇస్తాం. సాగర్ ఆయకట్టు ప్రాంతంలో పంటలను సాగు చేసే రైతులు సాగర్ నీటిని సద్వినియోగం చేసుకోవాల్సి ఉంటుంది. రామతీర్థం రిజర్వాయర్ గేటుకు మరమ్మతులు చేయాల్సి ఉన్న నేపథ్యంలో మరమ్మతులు పూర్తి కాగానే రిజర్వాయర్ నుంచి సాగర్‌జలాలను మళ్లీ ఇస్తాం.

– కే.లక్ష్మిరెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ, ఒంగోలు





రిజర్వాయర్ నుంచి ఓటీసీ ద్వారా వస్తున్న సాగర్ జలాలు

డీఈవోగా బాధ్యతలు స్వీకరించిన పిల్లి రమేష్



బాధ్యతలు స్వీకరిస్తున్న పిల్లి రమేష్

ఒంగోలు: జిల్లా విద్యాశాఖ అధికారిగా పిల్లి రమేష్ ఆదివారం స్థానిక డీఈవో కార్యాలయంలో విజయభాస్కర్ వద్దనుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను డీఈవో కార్యాలయ సిబ్బందితోపాటు పలువురు అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బి.విజయ భాస్కర్ మీడియాతో మాట్లాడుతూ తాను పనిచేసిన కాలంలో పదో తరగతి ఫలితాల్లో, పదో తరగతి సప్లిమెంటరీ ఫలితాల్లో రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో ఉండడం ఆనందం కలిగించిందన్నారు. ఇవే కాకుండా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆలోచనలకు అనుగుణంగా బాలికా వికాసం కార్యక్రమం ద్వారా పదో తరగతి ఉత్తీర్ణులైన 11 వేలమంది బాలికలను ఇంటర్మీడియెట్‌లో చేర్పించగలిగామని, కాఫీ విత్ కలెక్టర్ కార్యక్రమం ద్వారా చిన్నారుల్లో ఆలోచనలను రేకెత్తింపజేసి తద్వారా పాఠశాల స్థాయి నుంచే వారికి అవసరమైన ప్రోత్సాహాన్ని కల్పించేందుకు ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ఇదే కాకుండా రాష్ట్రంలా ఎక్కడా లేని విధంగా 9, 10, ఇంటర్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమం, మండలానికి ముగ్గురు టీచర్లను అకడమిక్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటుచేసి ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాలను అంచనా వేస్తూ అవసరమైన వారికి శిక్షణ ఇప్పించడం తదితర చర్యలు కూడా కలెక్టర్ ఆలోచనలకు అనుగుణంగా అమలు చేయగలగడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తనకు విధి నిర్వహణలో సహకరించిన అధికారులు, సిబ్బందితోపాటు ఉపాధ్యాయ సంఘాలకు ధన్యవాదాలు తెలుపుతున్నానని, నూతన జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా విద్యాశాఖ మరింతగా ప్రకాశించాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.

క్లుప్తంగా

నరసింహునికి అష్టోత్తర కలశాభిషేకం



స్వామివారికి కలశాలతో పూజ చేస్తున్న అర్చకులు

సింగరాయకొండ: పాతసింగరాయకొండలో పురాణ ప్రసిద్ధి చెందిన వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో ఆదివారం స్వాతి నక్షత్రం పర్వదినాన్ని పురస్కరించుకుని అష్టోత్తర కలశ స్నపన పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఉదయగిరి వెంకట శేష లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక హోమం, 108 కలశాలతో స్వామివారికి అభిషేకం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అక్రమ మద్యం పట్టివేత

● ఆరుగురిపై కేసులు నమోదు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఈబీ సూపరింటెండెంట్ ఆవులయ్య

దర్శి: దర్శితోపాటు పరిసర ప్రాంతాల్లో గోవా రాష్ట్రానికి చెందిన మద్యం అక్రమంగా తీసుకొచ్చి విక్రయిస్తున్న ఆరుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎ.ఆవులయ్య తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆవులయ్య మాట్లాడుతూ.. దర్శి మండలంలోని ఎర్రోబనపల్లి గ్రామానికి చెందిన యువకుని ద్వారా దొనకొండ మండలం అరవల్లిపాడుకు చెందిన ఒక వ్యక్తి, మరో నలుగురు కలిసి గోవా నుంచి అక్రమంగా మద్యం తెప్పించి విక్రయిస్తున్నారు. ఈ వ్యాపారంలో సూత్రదారులుగా ఉన్న వారిపై పక్కా ఆధారాలతో కేసులు నమోదు చేసి, 150 ఎం.ఎల్ పరిమాణం కలిగిన 288 మద్యం సీసాలు, మద్యం తరలింపునకు ఉపయోగించిన రెండు బైకులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు కొనసాగుతోందని, సంబంధం ఉన్న వారందరినీ అరెస్టు చేస్తామని చెప్పారు. కేసు దర్యాప్తు పూర్తయిన తర్వాత మరిన్ని వివరాలు వెల్లడిస్తామన్నారు. కార్యక్రమంలో దర్శి ఎస్‌ఈబీ సీఐ బి.సుందరరామయ్య, పొదిలి ఎస్‌ఈబీ సీఐ షేక్ ఖాజామొహిద్దీన్, ఎస్సై శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలకు కొత్త రూపు

దర్శి టౌన్: విద్యా వ్యవస్థ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేయడంతో ప్రభుత్వ కళాశాలల రూపురేఖలు మారుతున్నాయి. గత ప్రభుత్వ పాలనలో విద్యను నిర్లక్ష్యం చేయడంతో పాఠశాలలు, అంగన్‌వాడీలతోపాటు కళాశాలలు కూడా శిథిలావస్థకు చేరాయి. ఈ తరుణంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యావ్యవస్థ అభివృద్ధికి పెద్ద పీట వేసింది. పాఠశాలలు, అంగన్‌వాడీలు, కళాశాలల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే పాఠశాలల్లో పెను మార్పులు రాగా, తాజాగా కళాశాలలు కూడా నూతనత్వాన్ని సంతరించుకుంటున్నాయి.

నాడు- నేడు కింద జిల్లాలోని 23 కళాశాలల అభివృద్ధి

- రూ.14.56 కోట్లతో ప్రతిపాదనలు పంపిన అధికారులు
- తొలి విడతగా రూ.2.18 కోట్లు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం



కొమరోలు గవర్నమెంట్ కళాశాలలో నాడు- నేడు పనులు

జిల్లాలో మొత్తం 30 కళాశాలలు ఉన్నాయి. అందులో వసతుల లేమి ఉన్న 23 కళాశాలలను నాడు–నేడు కార్యక్రమం కింద అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కళాశాలలకు సైతం కార్పొరేట్ రూపు తేవడానికి రూ.14.50 కోట్లు అవసరమని ఇంజినీరింగ్ అధికారులు ప్రణాళికలు తయారు చేశారు. జిల్లాలోని అర్ధవీడు, చీమకుర్తి, కంభం, దర్శి, దొనకొండ, కనిగిరి, కొమరోలు, కొండపి, మద్దిపాడు, మర్రిపూడి, ఒంగోలు, పామూరు, పెద్ద దోర్నాల, పెద్ద చెర్లోపల్లి, పొదిలి, పొన్నూరు, శింగరాయ కొండ, తాళ్లూరు, టంగుటూరు, తురిమెళ్ల, త్రిపురాంతకం, ఉప్పుగుండూరు, యర్రగొండపాలెం కళాశాలల అభివృద్ధికి తొలి విడతగా రూ.2.18 కోట్లు మంజూరు కాగా పనులు చురుగ్గా సాగుతున్నాయి.

మౌలిక వసతుల ఏర్పాటుకు పెద్ద పీట

కళాశాలల్లో టాయిలెట్స్ లేక మహిళలు ఇబ్బంది పడుతుండటంతో వాటి ఏర్పాటుకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. అనంతరం గ్రీన్ చాక్ బోర్డ్స్, ఆర్ఓఆర్ ప్లాంట్, విద్యుత్ సౌకర్యం, ల్యాబ్స్ ఏర్పాటు, పరికరాల కొనుగోలు, మైనర్, మేజర్ మరమ్మతులు, గ్రానైట్ రాళ్ల ఫ్లోరింగ్, ఫర్నిచర్, కాంపౌండ్ వాల్ ఏర్పాటు పనులు ముమ్మరంగా చేస్తున్నారు. కళాశాలల్లో నిధులు దుర్వినియోగం కాకుండా తల్లిదండ్రుల కమిటీతో పాటు స్థానిక కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్లు, ఎక్స్ అఫీషియో మెంబర్ పర్యవేక్షణలో పనులు చేపట్టారు.

తొలి విడత పనులు పూర్తయ్యాయి



నాడు–నేడు కింద కళాశాలల అభివృద్ధికి నిధులు మంజూరు కావడంతో మౌలిక వసతులు మెరుగయ్యాయి. కాలేజీలు కొత్తగా కనిపిస్తూ విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. కార్పొరేట్ కళాశాలకు దీటుగా పనిచెయ్యాలంటే కొన్ని వసతులు ఎంతో అవసరం. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో మొదటి విడుత పనులు 80 శాతం పూర్తయ్యాయి. త్వరలో రెండో విడుత పనులు కూడా చేపడితే కళాశాలలు మరింత అభివృద్ధి చెందుతాయి.

– ఎస్.వెంకట సుబ్బారావు, డీవీఈఓ

విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం



కళాశాలలో విద్యార్థులకు మరుగుదొడ్ల వసతి లేక చాలా ఇబ్బంది పడుతున్నారు. మొదటి ప్రాధాన్యంగా టాయిలెట్స్ నిర్మించారు. నాడు–నేడు కింద కాలేజీల్లో మేజర్, మైనర్ రిపేర్లు చురుగ్గా సాగుతున్నాయి. బోర్డులు, తరగతి గదులు కూడా బాగవుతున్నాయి. ఈ పనులు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం.

– తారక్‌నాథ్, వీకే జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్, తాళ్లూరు



తాళ్లూరు వీకే కళాశాలలో నిర్మాణంలో ఉన్న టాయిలెట్స్



పొదిలి జూనియర్ కాలేజీలో డ్రింకింగ్ వాటర్ ప్యూరిఫయర్



కొండపి కాలేజీలో నాడు–నేడు పనులు



దర్శి కళాశాలలో నాడు–నేడు కింద మైనర్ పనులు

ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా చైర్మన్‌గా రవికుమార్

ఒంగోలు: ఒలింపిక్ అసోసియేషన్ ప్రకాశం జిల్లా చైర్మన్‌గా గోరంట్ల రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక శ్రీహర్షిణి డిగ్రీ కాలేజీ కాన్ఫరెన్స్ హాలులో ఆదివారం ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 26 క్రీడా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో క్రీడల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం నూతన చైర్మన్ ఎంపికపై చర్చించి శ్రీహర్షిణి విద్యాసంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్‌ను ఎంపిక చేశారు. క్రీడలను మరింత ప్రోత్సహించేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొంటూ రవికుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుర్రా భాస్కరరావు, బొడ్డు సుబ్బారావు తదితరులు రవికుమార్‌ను ఘనంగా సత్కరించారు. రవికుమార్ మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగంతో పాటు క్రీడా రంగాన్ని కూడా అభివృద్ధి చేసేందుకు, జిల్లాలోని పేద క్రీడాకారులకు ఉపాధి కల్పించేందుకు, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు పాటుపడతానని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ధనుంజయరావు, ఎస్.చంద్రశేఖరరావు, పీఎల్ రాజు, సురేష్‌బాబు, శేఖర్‌రెడ్డి, శ్రీకాంత్, భక్తధృవుడు, సత్యం, విజయ్‌కుమార్, ఆదినారాయణ, ఆర్.అచ్చయ్య, శ్రీహర్షిణి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



రవికుమార్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



పూర్వ విద్యార్థులు

దొనకొండ: చిన్ననాటి స్నేహితులు 42 ఏళ్ళ తర్వాత కలుసుకుని ఆప్యాయంగా పలకరించుకున్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1981–82లో 10వ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరుపుకున్నారు. తమ జీవితాల్లోని సుఖ సంతోషాలను స్నేహితులతో పంచుకున్నారు. ఆ బ్యాచ్‌కు చెందిన 70 మంది విద్యార్థులు భార్య, భర్తలు పిల్లలతో పాల్గొన్నారు. ఆనాటి గురువులు ఓసూరి కోటిరెడ్డి, శృంగారపు సుబ్బారెడ్డిలను పూలమాలలు, బొకేలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం సంయుక్త భోజనం చేశారు. పాఠశాలకు దూరప్రాంతాల వారు రావాలంటే ఇబ్బందికరంగా ఉండటంతో పాఠశాలకు సొంత బస్సు ఏర్పాటు చేయాలని ప్రధానోపాధ్యాయులు వీవీ రామాంజనేయులు కోరారు.

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు



ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ భూలక్ష్మి

తర్లుపాడు: వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం తర్లుపాడులో రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలను ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఏటా ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీలను తిలకించేందుకు సమీప గ్రామాల ప్రజలు భారీగా తరలిరావడంతో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. కురిచేడు మండలం కాటంవారిపల్లెకు చెందిన కాటం పెద్దిరెడ్డి ఎడ్ల జత 6 వేల అడుగులు లాగి ప్రథమ బహుమతి రూ.40 వేలు, చీమకుర్తికి చెందిన జంగా విజయభాస్కర్‌రెడ్డికి చెందిన ఎడ్ల జత 5,708 అడుగులు లాగి ద్వితీయ బహుమతి రూ.30 వేలు, నంద్యాల జిల్లా వంకరదిన్నెకు చెందిన పెద్ద శరబయ్య ఎడ్ల జత 5,270 అడుగులు లాగి తృతీయ బహుమతి రూ.20 వేలు సాధించాయి. పోటీలో పాల్గొన్న ఎడ్ల జతలకు కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ఎంపీటీసీ అంకమ్మ, ఎస్కే అలీసాహెబ్, ఆధ్వర్యంలో ప్రజలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.వరాలు, ఎంపీటీసీలు అంకయ్య, వైస్ సర్పంచ్ వెన్నా సత్యనారాయణరెడ్డి, నిర్వాహకులు చిన్నసత్యానారాయణరెడ్డి, ఏర్వ మల్లారెడ్డి, నాయకులు కోలగట్ల సత్యనారాయణరెడ్డి, పోలిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వృద్ధుడు మృతి



పరిశీలిస్తున్న ఎస్సై వెంకటేశ్వరరావు



మృతి చెందిన కాకి సత్యానందం

● మరొకరికి తీవ్ర గాయాలు

జరుగుమల్లి(సింగరాయకొండ): ముందు వెళ్తున్న మోటారుసైకిల్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో ఒక వృద్ధుడు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన జరుగుమల్లి మండల పరిధిలో జాతీయ రహదారిపై పాలేరు బ్రిడ్జిపైన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు కాకి సత్యానందం(72), కాకి ఏసు బైక్‌పై ఒంగోలు వెళ్తున్నారు. సత్యానందంకు అనారోగ్యంగా ఉండటంతో చికిత్స నిమిత్తం బైక్‌పై ఆస్పత్రికి వెళ్తుండగా పాలేరు బ్రిడ్జిపై అతివేగంగా వస్తున్న కారు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో కారు ముందు భాగంలో బైక్ ఇరుక్కుపోగా తండ్రీకొడుకులు కింద పడ్డారు. సత్యానందంకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన ఏసును హైవే అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. వాస్తవానికి ఏసు రోడ్డు మార్జిన్‌లో వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కారు డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకున్నాడా లేక మద్యం తాడి ఉన్నాడా అనేది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ పరారయ్యాడు. సత్యానందం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. టంగుటూరు హైవే పెట్రోలింగ్ కానిస్టేబుల్ శశిధర్‌రెడ్డి ఉన్నారు.

వలంటీర్ అదృశ్యంపై కేసు నమోదు

నాగులుప్పలపాడు: వలంటీర్ అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసినట్లు నాగులుప్పలపాడు ఎస్సై హరిబాబు తెలిపారు. ఎస్సై తెలిపిన సమాచారం మేరకు.. మండలంలోని ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన ఉప్పుగుండూరు శ్రీధర్ వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 10వ తేదీ ఇంటి నుంచి బయటకు వెళ్లిన శ్రీధర్.. తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు, స్నేహితులను విచారించినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో శ్రీధర్ భార్య మంజుల ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



శ్రీధర్ (ఫైల్)

చీతిరాల కతువలో మృతదేహం?

బేస్తవారిపేట: మండలంలోని సోమవారిపేట సమీపంలోని చీతిరాల కతువలో గుర్తు తెలియని మృతదేహం ఉందనే ప్రచారం జరిగింది. కతువ మధ్యలో తేలియాడుతూ శవంలాగా కనపడుతుండటంతో దానిని చూసేందుకు చుట్టు పక్కల ప్రజలు గుంపులు గుంపులుగా వెళ్తున్నారు. శవమా లేక ఏవైనా పనికిరాని వస్తువులు గోతంలో మూటగట్టి పడేశారా అనే అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

నాగులుప్పలపాడు: మండలంలోని కేశినేనివారిపాలెం గ్రామంలో పేకాటాడుతున్న నలుగురిని ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2,890 నగదు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



బెల్లంకొండ కాశయ్య (ఫైల్)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

పామూరు:రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన 565వ జాతీయ రహదారిపై పామూరు మండలంలోని తిరగలదిన్నె వద్ద ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై కే సురేష్‌యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఇనిమెర్ల గ్రామానికి చెందిన బెల్లంకొండ కాశయ్య తన భార్య బీబీజాన్‌తో కలిసి టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై, అదేగ్రామానికి చెందిన ఉప్పుటూరి మల్లికార్జున తన భార్య నాగమణితో కలిసి మరో మోటార్ బైక్‌పై వెళ్తున్నారు. వీరు నలుగురూ కలిసి నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలంలోని పొలాల్లో రైతులు వృథాగా వదిలేసిన ఎండు పొగాకు సేకరించి తెచ్చుకుంటున్నారు. తిరిగి వస్తున్న సమయంలో 565వ జాతీయ రహదారిపై తిరగలదిన్నె గ్రామం వద్ద బెల్లంకొండ కాశయ్య, బీబీజాన్‌ల టీవీఎస్ ఎక్సెల్ వాహనం ముందు వెళ్తున్న ఉప్పుటూరి మల్లికార్జున, నాగమణిల బైక్‌ను ఢీకొట్టింది. కాశయ్య, బీబీజాన్ కిందపడగా కాశయ్యకు తీవ్రగాయాలు, బీబీజాన్‌కు ఒక మోస్తరు గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను ఆటోలో పామూరు తరలించి అక్కడి నుంచి అంబులెన్స్‌లో కందుకూరు తరలిస్తుండగా మార్గం మధ్యలో కాశయ్య (50) మృతిచెందాడు. బీబీజాన్‌ని ఒంగోలులోని వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతోంది. అదృష్టవశాత్తూ ఉప్పుటూరి మల్లికార్జున, నాగమణిలకు ఎలాంటి గాయాలు కాలేదు. మృతుడి సోదరుడు మస్తాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ కాటూరి శ్రీనివాసరావు, ఎస్సై కే సురేష్‌యాదవ్‌లు మృతదేహాన్ని పరిశీలించి ప్రమాదానికి సంబంధించిన వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కనిగిరి వైద్యశాలకు తరలించారు.